ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

బుధవారం | అక్టోబరు 28, 2026 | సంపుటి : 7 | సంచిక : 123 | పేజీలు : 2



అర్నబ్ అలర్ట్

- తుపాను ముప్పు ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు
- ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే లక్ష్యం
- ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, ఆయుధం: అర్నబ్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు భారీ స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టామని, ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు చెందిన 30 వేలకుపైగా బోట్లను సముద్రం నుంచి వెనక్కి రప్పించామని, గోపాల్‌పూర్‌లో ఏపీకి చెందిన 93 బోట్లు, వాటి సిబ్బంది సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వైద్య సేవల కోసం 1,316 అంబులెన్సులను సిద్ధం చేయడంతోపాటు, 5వేల మంది గర్భిణులను సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు తరలించినట్లు వెల్లడించారు. విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించేందుకు 8,400 మంది సిబ్బందిని సిద్ధం చేశామని, తుపాను ప్రభావంతో 15 వేల వరకు విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

హుద్‌హుద్‌తో పోలిస్తే తీవ్రత తక్కువే..

నాగావళి, వంశధార నదులకు వరద వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉన్నామని, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను అంచనా వేస్తూ చెరువులకు గండ్లు పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ముంపు గ్రామాలకు ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామని తెలిపారు. సుమారు 7.16 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 16 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తీరప్రాంత గ్రామాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని, నీటి ప్రవాహాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తోపాటు నౌకాదళం, కోస్టు గార్డులను అప్రమత్తం చేశామని, హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువగా ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

ప్రతి గంటకూ బులెటిన్ విడుదల

ఆర్నబ్ తుపాను ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులతో తీవ్ర నష్టం వాటిల్లే (మిగతా 2లో..)

సీఈసీ జ్ఞానేశ్ కుమార్

రాజీనామా చేసే వరకు పోరాటం

- కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- బిలియనీర్ల ప్రయోజనాల కోసమే బీజేపీ ప్రయత్నం

జాతీయం, ఆయుధం:

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు లేదా ప్రధాని మోదీ ఆయన్ను సీఈసీ పదవి నుంచి తొలగించే వరకు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తమ నిరసనలను ఆపబోవని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలో కోట్లాది మంది ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని ఆరోపించారు. తాము చాలా కాలంగా ఓట్ చోరీ అంశాన్ని లేవనెత్తుతున్నామని అన్నారు. అయితే ఇప్పుడు అత్యున్నత స్థాయిలో ఓట్లు చోరీ అవుతున్నాయని యావత్ దేశం అర్థం చేసుకోవడం ప్రారంభించిందని తెలిపారు. దేశ రాజధానిలోని త్రిలోక్‌పురిలో జరిగిన జన్ సున్వాయి కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

ఈ ప్రజా ఉద్యమాన్ని అణచివేసేందుకు మోదీ- షా కుట్ర: ఖర్గే

ఓట్ చోరీకి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ ఉద్యమాన్ని దారి మళ్లించే వారి ఎత్తుగడలు, బూటకపు ప్రచారం కేవలం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తోందని మండిపడ్డారు. దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు ఇండియా కూటమి తన ప్రజాస్వామ్య పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.

'ఆ ధ్యయం జ్ఞానేశ్‌ను ఎందుకు కాపాడుతోంది'

"ఎన్నికల సంఘం రహస్యాలు బయటపడుతూ, ఓట్ చోరీ బట్టబయలవుతున్న వేళ మోదీషా ధ్యయం సర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు! వారు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారు?. ఈ దారి మళ్లించే ఎత్తుగడలు, బూటకపు ప్రచారం కేవలం మోదీ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తూ, దేశ ప్రజాస్వామ్యాన్ని మసకబారుస్తున్నాయి" అని ఖర్గే పేర్కొన్నారు.

"త్రిలోక్‌పురి ప్రాంతంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కేవలం నాలుగు బూత్‌ల నుంచే 416 మంది ఓటర్ల పేర్లను చట్టవిరుద్ధంగా తొలగించారు. మేము ఈ ఓట్ల తొలగింపుపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రశ్నించాం. కానీ ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించి దాక్కుంటున్నారు. అయినా మేము వెనక్కి తగ్గము. జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు లేదా ప్రధాని మోదీ ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు ప్రతిపక్షం తమ పోరాటాన్ని కొనసాగిస్తుంది. దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోతున్నారు. విపక్షాలు చాలా కాలంలో ఓట్ చోరీ అంశాన్ని లేవనెత్తుతున్నాయి. అయితే ఇప్పుడు అత్యున్నత స్థాయిలో ఓట్ చోరీ జరుగుతోందని దేశ ప్రజలు అర్థం చేసుకోవడం ప్రారంభించారు. కేంద్రం, సీఈసీ కలిసి ముఖ్యంగా పేద ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారు. కొద్ది మంది బిలియనీర్ల ప్రయోజనాల కోసం మాత్రమే పని చేసేలా, సామాన్య పౌరులకు హక్కులు లేని నయా భారత్‌ను సృష్టించేందుకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నయా భారత్‌లో పేద పౌరులకు హక్కులు ఉండవు. "

– రాహుల్ గాంధీ, లోక్‌సభలో విపక్ష నేత





పోలీస్ అమరవీరుల

త్యాగాలు మరువలేనివి

- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్

హనుమకొండ, ఆయుధం: ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే సందేశాన్ని చాటింది. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎన్ పి డిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రై సిటీ లోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ వారికి అంకితమైన ఘనమైన నివాళి అని తెలిపారు.సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా, 89 సంవత్సరాల వయస్సులోనూ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మామిడి నర్సయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకమని, వయస్సు అనేది వ్యాయామానికి అడ్డంకి కాదని ఈ ర్యాలీ నిరూపించిందని తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితాలో..

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి
- అర్హులందరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: జిల్లాలో 2023 అక్టోబర్ 31 నాటికి పట్టబద్రులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో స్వీప్ కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని టీజీవో, టీఎన్జీవో, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, అపార్ట్మెంట్స్ అసోసియేషన్ల ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో గతంలో కంటే ఎక్కువ మంది అర్హులు నిర్జీత గడువులోగా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. వాకర్స్ అసోసియేషన్లు, అపార్ట్మెంట్ అసోసియేషన్ల సహకారంతోనూ ఓటరు నమోదుపై ప్రచారం చేపట్టాలని తెలిపారు. పబ్లిక్ గార్డెన్, ఆర్ట్స్ కాలేజీ వంటి పట్టభద్రులు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని అధికారులకు తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరాన్ని బట్టి ఒకటి లేదా రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని వివిధ సంఘాలు, సంస్థల ప్రతినిధులు ముందుకొస్తే వారి సహకారంతో ఓటరు నమోదు ప్రక్రియను మరింత విస్తృతం చేయవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రతిసారీ కొత్తగా రూపొందించే ప్రక్రియ చేపడతారని, గతంలో ఓటరుగా నమోదు చేసుకున్నవారి పేర్లు ప్రస్తుత జాబితాలో కొనసాగవని స్పష్టం చేశారు. అందువల్ల అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా కొత్తగా జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు ప్రతి పట్టభద్రుడికి ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, స్వీప్ నోడల్ అధికారి మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజ్ గౌడ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రావు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ కుమార్,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, ఇతర అధికారులతో పాటు టీజీవో, టీఎన్జీవోస్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, కెయూ ప్రొఫెసర్లు, అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




యువతను సామాజిక కార్యక్రమాలలో

భాగస్వాములను చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ, ఆయుధం: యువతను పలు సామాజిక కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మై భారత్ కో ఆర్డినేటర్లు, ఇతర అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మై భారత్ కో ఆర్డినేటర్లు, అధికారులతో యువత కు సంబంధించిన అంశాలు, హనుమకొండ లోని యూత్ హాస్టల్ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మై భారత్ పోర్టల్ లో ఎంతమంది యువత నమోదు అయ్యి ఉన్నారు, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను గురించి కలెక్టర్ మై భారత్ జిల్లా అధికారి భూక్యా సంజీవ్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... టీబీ ముక్త్ భారత్, తదితర సామాజిక కార్యక్రమాలలో మై భారత్ వాలంటీర్లు, యువతను భాగస్వాములను చేయాలన్నారు. శిక్షణకు వచ్చిన మై భారత్ అధికారులు చారిత్రక వరంగల్ జిల్లాలో వేయి స్తంభాల దేవాలయం, రామప్ప, మేడారం, కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువులు, ఆలయాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. అదేవిధంగా హనుమకొండలోని యూత్ హాస్టల్ లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతామన్నారు. యూత్ హాస్టల్ లో వసతులు మెరుగ్గా ఉండేలా యువతకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన మై భారత్ అధికారులు సుమీ సింగ్, విజయ్ సూర్య, ప్రశాంత్ కుమార్, యష్‌మహేశ్వరి, అనూష పారిక్, అబ్దుల్లా అహ్మద్, మెహుల్ బాబూభాయ్ లతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 20262027 పోస్టర్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మై భారత్ జిల్లా అధికారి భూక్యా సంజీవ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు, ఆర్ అండ్ బి డీఈ గోపీ కృష్ణ, ఏఈ ఉదయ్, క్రీడల శాఖ నుండి మౌనిక, పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ రత్నమాల రమా, డాక్టర్ మమత, పాల్గొన్నారు.






వరంగల్ టూరిజం సర్క్యూట్‌కు

ప్రతిష్టాత్మక గుర్తింపు

- 'బి వీక్ హెరిటేజ్ అవార్డ్స్ –2026'లో హెరిటేజ్ టూరిజం విభాగంలో సిల్వర్ బన్యన్ అవార్డు

న్యూఢిల్లీ, ఆయుధం: తెలంగాణ పర్యాటక రంగానికి మరో విశిష్ట గుర్తింపు లభించింది. న్యూఢిల్లీలోని తీన్‌మూర్తి మార్గ్‌లో ఉన్న ప్రధానమంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీలో అక్టోబర్ 27, 2026న నిర్వహించిన 'ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్-2026' కార్యక్రమంలో తెలంగాణలోని వరంగల్, హన్మకొండ, ములుగు టూరిజం సర్క్యూట్‌కు హెరిటేజ్ టూరిజం విభాగంలో 'బెస్ట్ టూరిస్ట్ సర్క్యూట్ / బెస్ట్ టూరిస్ట్ ట్రైల్' కేటగిరీలో సిల్వర్ బన్యన్ అవార్డు లభించింది. ఈ అవార్డును కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ప్రదానం చేశారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (TGTDC) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి వల్లూరు క్రాంతి మార్గ దర్శకత్వంలో రాష్ట్రంలోని గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని, పర్యాటక సామర్థ్యాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు చేపడుతున్న నిరంతర ప్రయత్నాలకు ఈ అవార్డు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ టూరిజం సర్క్యూట్ తెలంగాణలోని ఘనమైన కాకతీయ వారసత్వం, ప్రాచీన దేవాలయాలు, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం, సుందరమైన సరస్సులు, జలపాతాలు, గిరిజన సంస్కృతి, చేనేత సంప్రదాయాలు, ప్రకృతి ఆధారిత పర్యాటక అనుభవాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానిస్తుంది.



తీరం వైపుగా 'అర్నబ్'

- పలు విమాన సర్వీసుల రద్దు

అమరావతి, ఆయుధం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను 'అర్నబ్' (Cyclone Arnab) గంటకు 20 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన 6 గంటల్లో గంటకు 18 కి.మీ వేగంతో కదిలిన అతి తీవ్ర తుపాను.. ప్రస్తుతానికి విశాఖపట్నానికి 170 కిలోమీటర్లు, కాకినాడకు 140, మచిలీపట్నంకు 230, బాపట్లకు 300 కి.మీ దూరంలో (మిగతా 2లో..)



హనుమకొండను కరువు జిల్లాగా ప్రకటించాలి

- సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్

హనుమకొండ, ఆయుధం: ఎల్ నినోతో రాష్ట్రం లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో కరువు జిల్లాగా హనుమకొండ జిల్లాను, అన్ని మండలాలను ప్రకటించి ఆదుకోవాలని సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ డిమాండ్ చేశారు. మంగళవారం రామారం లోని ఓఆర్ఆర్ బ్రిడ్జి శాఖ సీపీఐ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న తీవ్రమైన కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, కరువు జిల్లాగా హనుమకొండ జిల్లాను, అన్ని మండలాలను ప్రకటించి ఆదుకోవాలని, అదేవిదంగా చౌకధరల దుకాణాల ద్వారా ప్రస్తుతం అందిస్తున్న ఒక్కరికీ 6 కిలోల బియ్యానికి తోడు మరో 6 కిలోల బియ్యం కలిపి మొత్తం 12 కిలోల బియ్యం, అదేవిదంగా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని, నష్టపోయిన పంటలకు, రైతులకు నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని, కరువు వలన పని కోల్పోతున్న అసంఘటిత కార్మికులకు ప్రత్యేక పథకం ద్వారా ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం, నాయకులు పార్వతం భాగ్య, రాగల్ల ప్రభాకర్, గోల్కొండ సారయ్య, గడ్డం సారయ్య, వంకుడోతూ రాజు కుమార్, జన్ను మంజుల, భోగం అనురాధ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

- డాక్టర్ అనితా రెడ్డి, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్

హనుమకొండ, ఆయుధం: సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి, హన్మకొండలోని జిల్లా పరిషత్తు ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ ను సందర్శించి అందులో వయో వృద్ధులకోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్, లీగల్ ఎయిడ్ క్లినిక్, లాబ్రెరీ ఎలా నడుస్తుందో పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం లీగల్ సలహాలు, సూచనలు కోసం సంప్రదించడానికి ఎంత మంది వస్తున్నారు? ఎన్ని కేసులు వచ్చాయి? సలహాలు, సూచనలకోసం ఎంత మంది వచ్చారు, కౌన్సిలింగ్ కి ఎంత మంది వస్తున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ, ఉచిత న్యాయ సలహాల కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు. వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు వరం అన్నారు. జిల్లాలోని ట్రిబ్యునల్ కోర్టుకు వస్తున్న కేసులు పని చేస్తున్న తీరును డాక్టర్ అనితా రెడ్డి వివరించారు. ఇక ముందు కూడా సీనియర్ సిటిజన్స్ కోసం మరింతగా పనిచేయాల్సిన విషయాల గురించి అక్కడ సిబ్బందితో చర్చించారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు ద్వారా వృద్ధులకు మరిన్ని సేవలు అందిద్దాం అని, సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిద్దాం అని, అన్ని డిపార్ట్మెంట్స్ కన్వర్జెన్సీతో వయోవృద్ధుల కోసం పని చేద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ ఉష, ఉమ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఎక్సైజ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం

హనుమకొండ, ఆయుధం: ప్రజావాణి కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎక్సైజ్ శాఖ అధికారులతో వారి కార్యకలాపాల పైన కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు, జిల్లాలో అక్రమ మద్యంపై ఇప్పటి వరకూ నమోదు చేసిన కేసులు, బెల్ట్ షాపుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 27 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ట్రైనీ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నీలోఫర్ అజ్మీ, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్నబ్ అలర్ట్..

(మొదటి పేజీ తరువాయి..)

ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ తుపాను సన్నద్ధతపై నిరంతరం సమీక్షిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని తెలిపారు. పశ్చిమగోదావరి, కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, కాకినాడ సమీపంలోని యానాం వద్ద తుపాను తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ ప్రాంతాల్లో నష్టం తీవ్రత అధికంగా ఉండొచ్చని, కొన్ని చోట్ల అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. శ్రీకాకుళంలో 30 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరిలో 28, విశాఖపట్నంలో 23 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, చాలా ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షాలు కురుస్తాయని వివరించారు. తీరప్రాంత జిల్లాల్లో సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చే ప్రమాదం ఉన్నందున తీర గ్రామాలు, లంకలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 290 శిబిరాలు ఏర్పాటు చేసి 84,396 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేస్తున్నాయని, ప్రతి గంటకూ తుపాను హెచ్చరికల బులెటిన్ విడుదల చేస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని తెలిపారు.

ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు

- నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి వసతులపై ప్రత్యేక కార్యాచరణ.
- ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలి.
- క్షేత్రస్థాయి పర్యవేక్షణతో నిర్దేశిత గడువుల్లో లక్ష్యాలు పూర్తి చేయాలి.
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు, ఆయుధం: ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థల పరిస్థితిని ఆవాసాల వారీగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచుతూ, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ విభాగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎల్‌నినో సన్నద్ధత, తాగునీటి వసతులు, జలసిరి పనులు, ఉపాధి కూలీల హాజరు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనిదినాల కల్పన తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలోని అన్ని ఆవాసాల్లో తాగునీటి సరఫరా మౌలిక వసతులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రిడ్ ద్వారా ఆవాసాలు, పట్టణ ప్రాంతాలకు అందుతున్న శుద్ధి చేసిన నీటి సరఫరాతోపాటు, గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీరు చేరుతున్న తీరును పరిశీలించాలని ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణకు ముందుగా నవంబర్ రెండో వారంలోగా మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇంట్రా, గ్రిడ్ ఏఈలు, ఏఈఈలు, ఎంపీఓలు, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో మండల బృందాలను ఏర్పాటు చేసి, రోజువారీ పర్యటనల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. పైపులైన్లు, స్లూయిస్ వాల్వుల వద్ద లీకేజీలను అరికట్టాలని సూచించారు. ఓవర్ హెడ్ నీటి ట్యాంకులను నిర్ణీత తేదీల్లో శుభ్రపరచడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ట్యాంకుల మ్యాన్‌హోల్ మూతలు, కీటకాలు ప్రవేశించకుండా ఉండే వెంటిలేటర్ల జాలీలు, మెట్ల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. నీటి శుద్ధికి క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ వినియోగిస్తూ, సరఫరా చివరి ప్రాంతంలో అవశేష క్లోరిన్ స్థాయిని పరీక్షించాలని సూచించారు. అవసరమైన బ్లీచింగ్ పౌడర్ నిల్వలు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఇంటి నల్లా కనెక్షన్ పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు నీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచడంతోపాటు నిర్వహణ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. భూగర్భ జలమట్టాలు తగ్గడం, స్థానిక నీటి వనరులు ఎండిపోవడం, తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ఆవాసాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరుల స్థిరత్వం, సరఫరా వ్యవస్థ సామర్థ్యం, నీటి నిల్వ సదుపాయాలు, స్థానిక ప్రత్యామ్నాయ వనరులను అంచనా వేయాలన్నారు. సమస్యాత్మక ఆవాసాల వివరాలను కార్యాచరణ ప్రణాళికతో సహా సంబంధిత ఈఈ, జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టేలా గ్రామ పంచాయతీలకు సూచనలు ఇవ్వాలన్నారు. మండల బృందాలు ఆవాసాల వారీగా రోజువారీ నివేదికలను మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ, జిల్లా పంచాయతీ అధికారికి అందించాలని సూచించారు. వాటిని క్రోడీకరించి జిల్లా స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలను అవసరానికి అనుగుణంగా మండల, జిల్లా స్థాయి సమావేశాల్లో పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తూ గ్రామ పంచాయతీలు, ఆవాసాల వారీగా కూలీల హాజరును పరిశీలించి, తక్కువగా ఉన్న చోట పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ఉపాధి పనిదినాల కల్పన, సంబంధిత వివరాల నమోదుపై దృష్టి సారించాలన్నారు. గత పనుల చెల్లింపుల్లో ఆలస్యం, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుకు సంబంధించిన సమస్యలను అధికారులు వివరించారు. నీటి కుంటలు, ఇందిరా జలప్రభ, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వర్మీ కంపోస్టు ట్యాంకులు తదితర పనులకు అంచనాల సమర్పణ నుంచి అనుమతుల మంజూరు వరకు ప్రతి దశను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సిబ్బంది సహకారంతో ఈ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయించే బాధ్యత ఎంపీడీఓలదేనని స్పష్టం చేశారు. అధికారులు ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులు, సిబ్బంది విధులను పర్యవేక్షించాలని సూచించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి పంచాయతీల వారీగా లక్ష్యాలు కేటాయించాలని, తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన పురోగతి చూపాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓలు కూడా తమ మండల పనులపై పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు.
పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి అందుతున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సంతకాల ఫోర్జరీ వంటి తీవ్రమైన ఆరోపణలను సాధారణ పొరపాట్లుగా పరిగణించరాదని స్పష్టం చేశారు. సిబ్బంది తమకు నిర్దేశించిన విధులను సక్రమంగా నిర్వర్తించేలా పర్యవేక్షించాలని, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని సహించబోమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి ఆర్ డి ఓ రవీందర్, డి పి ఓ వెంకయ్య, ఆర్ డబ్లూఎస్ సునీత, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.





ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు టీఆర్‌పీ మద్దతు

వరంగల్, ఆయుధం: జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో చేపట్టిన సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గరిగె సుమతి నాయకత్వంలో పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తున్న NHM ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారికి న్యాయం చేయాలని అన్నారు. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వారి డిమాండ్ల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల సంపత్ పటేల్ మాట్లాడుతూ, NHM ఉద్యోగుల సమస్యలను MLC తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా NHM ఉద్యోగులు తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేసి, తమ డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని కోరారు. NHM ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వారికి అండగా ఉంటూ, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని గరిగె సుమతి, పెండ్యాల సంపత్ పటేల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూచన సునీత, దాసరి శ్రీదేవి, రాచర్ల రచన, ఉమా, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

పొక్సో చట్టం పిల్లలకు సరైన రక్షణ

- ప్యానెల్ అడ్వొకేట్ దండు మోహన్

హనుమకొండ, ఆయుధం: భారత ప్రభుత్వం పిల్లల రక్షణ కోసం 2012లో రూపొందించిన (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ POCSO Act 2012) పోక్సో చట్టం పిల్లలకు సరైన రక్షణ కల్పిస్తుందని పానెల్ అడ్వొకేట్ దండు మోహన్ తెలిపారు. హన్మకొండ జిల్లా ఉచిత న్యాయ సేవా సంస్థ (DLSA) కార్యదర్శి, జడ్జీ ఎన్.వెంకట హైమా పూజిత గారి ఆదేశాల మేరకు హన్మకొండ రెడ్డికాలనిలోని బాసిత్ నగర్ ప్రభుత్వ హై స్కూల్లో మంగళవారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సును DLSA ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అడ్వకేట్ మోహన్ మాట్లాడుతూ.. ఈ చట్టం 18 సంవత్సరాల వయస్సులోపు పిల్లలకు వర్తిస్తుందని తెలిపారు. లైంగిక వేధింపుల పట్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తగిన మెలకువలను పిల్లలకు వివరించారు. ఎవరో చేసిన తప్పిదానికి పిల్లలు బాధ్యులు కారని, సహాయం కోరి వచ్చిన బాధిత పిల్లలకు తగిన సహాయ, సహకారాలు అందించాలని ఆయన కోరారు. లైంగిక వాంఛతో పిల్లల శరీర భాగాలను ఎవరూ ముట్టుకున్నా పోక్సో చట్టం పరిధిలోకి వస్తారని అన్నారు. ఈ చట్టం ప్రకారం నేర తీవ్రతను బట్టి 10 ఏండ్ల నుంచి 20 సంవత్సరాలు, యావజీవ కారాగారం, మరణ శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందన్నారు. బాధిత పిల్లలు తమకు నమ్మదగిన వ్యక్తుల ద్వార పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం DLSA లో కూడా దరఖాస్తు చేసుకోవాలని మోహన్ కోరారు. ఈ సందర్భంగా పిల్లలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించే బ్రోచర్లను విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది సుందర్ రామ్, బాసిత్ నగర్ హెడ్మాస్టర్ పరమేశ్వర్, ఉపాధ్యాయులు సుమారు మూడువందల మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి

- బి.కె.యం.యు.జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు



వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని పోచమైదాన్ సర్కిల్ లో ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మెకు మంగళవారం నాటికి 15వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా (బి.కె.యం.యు.) భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు నిరవధిక సమ్మెకు విచ్చేసి సంఘీభావం తెలిపారు. సందర్భంగా తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ... తక్షణమే ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరనీ రెగ్యులరైజేషన్ చేయాలని, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్, లోయల్టీ బోనస్, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 180 రోజులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా. టీ భరత్ కుమార్, డాక్టర్. దిలీప్ ,డాక్టర్ కిరణ్, డాక్టర్ హుస్సేన్, డాక్టర్. హరికృష్ణ , డాక్టర్ సునీత దేవి, డాక్టర్ యశస్విని, డాక్టర్ అనిత, డాక్టర్ సదానందం, డాక్టర్ రమ్య, డాక్టర్ మధు, డాక్టర్ హారిక, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్చన, ఈవిన్ మేనేజర్ రవీందర్, డైకు మేనేజర్ మేర్గు అనిల్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్స్ స్వప్న, కళ్యాణి, మంజుల, సుమలత, ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్, తీగల సతీష్ కుమార్, అకౌంటెంట్ ఆచంట అభిషేక్, శ్వేత, ప్రేమలత, శ్రీనివాస్ బాబు, టీ.బి.డిపార్ట్మెంట్ రంజిత్, రాకేష్, ఏ.ఎన్.ఎం.లు జ్యోతి, సుల్తానా, పేనీన, ఉప్పలమ్మ, నర్మద, రాజేశ్వరి, ప్రభావతి, అనిత, శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్లు జూకంటి మౌనిక, ఎం.ఎన్.ఓ. ఏకుల చిరంజీవి, బండి రాజేష్, కుమార్, సపోర్టింగ్ స్టాఫ్ గౌస్ పాషా, గూడెపు ప్రభాకర్, రజియా, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలు ప్రారంభం

వరంగల్, ఆయుధం: వరంగల్ ఓ సిటీ యందు 70వ ఎజిఎఫ్ఐ వరంగల్ జిల్లా స్థాయి అండర్ 14 బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్ కం సెలక్షన్ కు ఆరు జోన్ల నుండి 450 మంది క్రీడాకారులు, వందమంది పిఈ టి, పిడిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మీసాల ప్రకాష్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ మాట్లాడుతూ.. క్రీడలకు పుట్టినిల్లు వరంగల్ అని ఎంతోమంది అనేక రకాల క్రీడలతో వరంగల్ జిల్లా పేరు ప్రతిష్టలను రాష్ట్రస్థాయి జాతీయ స్థాయిలో పేరు తెచ్చారని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో ఆడి వరంగల్ జిల్లాను రాష్ట్రస్థాయిలో పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా బి.రంగయ్య నాయుడు, బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్, డిఈసిబి సెక్రెటరీ కృష్ణమూర్తి, డివైఎస్ ఓ అనిల్, ఏఎంఓ మహేష్ నాయక్, నాగేశ్వరావు, వరంగల్ జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ పుల్ల అనిల్ కుమార్, పిఈటి టిఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మన్నం వెంకటేశ్వర్లు, పేట గౌరవ అధ్యక్షులు పాక శ్రీనివాస్, సెక్రటరీ జలగం రఘువీర్, మాజీ ఎస్ జిఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ పుల్లా సుధాకర్, ఆరు జిల్లాల జోనల్ సెక్రటరీలు జిల్లాలోని పిఈటిలు పీడీలు పాల్గొన్నారు.



బుద్ధరఘు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ కమిషన్ వ్యాపారి బుద్ధ రఘు అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వరంగల్ జిల్లా కూరగాయల మార్కెట్ వ్యాపారస్తుల పరపతి సంఘం అధ్యక్షులు బేతి అశోక్ బాబు ఆధ్వర్యంలో వారి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. సంఘం అధ్యక్షులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో సెక్రటరీ కసర్ల రాజు యుగంధర్, బూరుగుపల్లి శ్రీనివాస్, పాటల రవి, భద్రయ్య, నేపాల్ రాజు, బబ్బూరి నరేష్, అమర్, వడ్డే నిర్మల్ పాల్గొన్నారు.

తీరం వైపు అర్నబ్..

(మొదటి పేజీ తరువాయి..)

కేంద్రీకృతమైంది. రేపు ఉదయానికి బాపట్ల విశాఖ మధ్య యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశముందని అంచనా వేస్తున్నట్టు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం దాటే సమయంలో 125135 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ప్రజలు బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు

పలు విమాన సర్వీసులు రద్దు

అర్నబ్ అతి తీవ్ర తుపాను నేపథ్యంలో భోగాపురం విమానాశ్రయం నుంచి పలు విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. భోగాపురం నుంచి దిల్లీ, హైదరాబాద్, కర్నూలు తిరుపతి, బెంగళూరు, కోల్‌కతా, చెన్నైకి వెళ్లాల్సిన 16 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695